సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

గంగారం, ఆగస్టు 30 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షలలోపు పంటరుణాలను ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.2లక్షలలోపు పంట రుణాలను మూడు విడుతల్లో మాఫీ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారని, ఇంకా అర్హులైన 40శాతం మంది రైతులకు మాఫీ వర్తించలేదన్నారు. ప్రగతిశీల రైతు సంఘం నాయకులు కుర్సం రంగయ్య, ఈక భిక్షం, వీరస్వామి, సురేశ్, అశోక్, రాంబాబు పాల్గొన్నారు.

'చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి'

విద్యార్థులకు స్టడీ బుక్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 30 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువుపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని స్ఫూర్తి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జమాండ్లపల్లి జడ్పీహెచ్ పాఠశాలలో స్ఫూర్తి ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ బుక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎంఎంఎస్ బుక్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని, ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఇంటర్ వరకు ప్రతి సంవత్సరం రూ.12వేలు స్కాలర్ షిప్‌గా వస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సమ్మెట వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు బ్రహ్మం, సైదులు, శ్రీవాణి పాల్గొన్నారు.

'మురుగునీటి సమస్యను పరిష్కరించాలి'

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

తొర్రూరు, ఆగస్టు 30 : మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కమిషనర్ శాంతికుమార్‌కు నాగేశ్వరకాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. దీంతో స్పందించిన కమిషనర్ ఆ కాలనీని సందర్శించి మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమం లో నాగేశ్వరకాలనీ వాసులు పల్లె కుమార్, చిట్టి అశోక్‌రెడ్డి, నాగెల్లి భిక్షం, దొరపల్లి రాజేశ్, ధర్మారపు వేణు, లూనావత్ మంగీలాల్, నరేందర్, వేణుచారి, వెంకటమ్మ, రాజమౌళి పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు కూల్చేస్తాం

మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

తొర్రూరు, ఆగస్టు 30 : తొర్రూరు మున్సిపాలిటీలోని పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ నుంచి 100 మీటర్ల బఫర్ జోన్ పరిధిలో ఇండ్లు, వాణిజ్యపరమైన నిర్మాణాలను నోటీసులు ఇవ్వకుండానే కూల్చేస్తామని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ లే అవుట్ నిబంధనలు పాటించాలన్నారు. ఖాళీగా ఉన్న జాగల్లో నీరు నిల్వ ఉండకుండా యజమానులు చర్యలు తీసుకోవాలని సూచించారు. భూమిని చదును చేసుకొని ప్రహరీలు నిర్మించుకోవాలని, లేనిపక్షంలో చట్టానికి లోబడి చర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకొని గృహాలు నిర్మించుకునే వారు రోడ్డుకు 5 ఫీట్ల సెట్‌బ్యాక్ ఉండేలా చూసుకోవాలన్నారు. శిథిలావస్థలో ఉన్న గృహాల వివరాల సమాచారం అందిస్తే కూల్చివేస్తామని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HOSPITAL STAFF
★Pharmacy Boys, Operation Theater Boys & Receptionist / సిస్టమ్ ఆపరేటర్స్ కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2 PM.
NTW-0418

BUSINESS OFFER
★చాలా పెద్ద చదువులు చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు సువర్ణావకాశం. అతి తక్కువ పెట్టుబడితో ప్రతి నెల అత్యధికంగా సంపాదించుకునే సువర్ణావకాశం. సంప్ర: సెల్: 9502940056.
NTW-326315

PLOTS FOR SALE

★వరంగల్ నాయుడు పెట్రోల్‌పంప్, వరంగల్ నుండి ఖమ్మం హైవే రోడ్‌కు దగ్గరలో 248 చ.గ.లు Size: 64x35, 33 ఫీట్ల రోడ్ గల ప్లాట్ అమ్మబడును. సంప్ర: 9676147575
NTW-323349

To-Let / Rent
★ 3BHK Residence 2400 Sft. Semi Furnished as per vastu, Lift & Generator, Car Parking available for Rent @ Reddy colony near Vikas H.School, HNK. 8886996262.
KMM-

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- వసతి గృహాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్

గూడూరు, ఆగస్టు 30 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యవంతం చేసేలా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ), ప్రభుత్వ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల, ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సీహెచ్‌సీలో తనిఖీలు చేపట్టిన కలెక్టర్ ఇన్, ఔట్ పేషెంట్ వివరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేపట్టిన కార్యక్రమాల రిజిస్టర్లు, మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విషజ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, వైద్యశాలల్లో మందులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల, ఉన్నత పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు బోధన అందించాలని, శుభ్రమైన పౌష్టికాహారం అందజేయాలన్నారు. వసతి గృహాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. కాగా, సీహెచ్‌సీలో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని, ప్రజలకు వైద్యం అందించేందుకు 30 పడకల స్థాయిలో యంత్ర సామగ్రి, మందులు అందుబాటులో ఉంచాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేశ్‌యాదవ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలి..

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 30 : సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మెడికల్ ఆఫీసర్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాల్లో షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వనమహోత్సవం లక్ష్యాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు.

కురవి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

వీరభద్రుని సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

కురవి, ఆగస్టు 30 : మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణ చివరి శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. సుమారు 30మంది మహిళలు పాల్గొన్నారు. ఆలయ పూజారులు అనిల్, రెడ్యాల శ్రీనివాస్, వేదపండితులు శ్రీకాంత్, బాలకృష్ణ పూజలు చేశారు.

'రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి'

కేసముద్రం, ఆగస్టు 30 : ధ్వంసమైన రోడ్లను గుర్తించి మరమ్మతు పనులు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్ ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు రోడ్లు ధ్వంసమై వాహనదారులు ఇబ్బందిపడుతున్నారని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనట్లు తెలిపారు. కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులకు రాయితీ కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుభారం మోపుతున్నదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు మంద భాస్కర్, కాసు సాయిచరణ్ పాల్గొన్నారు.

ప్రైవేట్ దవాఖానలు నిబంధనలు పాటించాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మురళీధర్

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 30 : జిల్లాలోని ప్రైవేట్ దవాఖానలు నిబంధనలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మురళీధర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రైవేట్ దవాఖానలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రైవేటు దవాఖానల్లో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి కేసులు నమోదైతే, సమాచారాన్ని జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి అందించాలన్నారు. రక్త పరీక్షలు, ఫీజుల వివరాలను స్థానిక భాషలో దవాఖాన బోర్డుపై ప్రదర్శించాలన్నారు. లేకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రమీల, ప్రోగ్రామ్ అధికారులు నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, రాజు, గీత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్యం

మాట్లాడుతున్న ఉప్పెనపల్లి శ్రీనివాస్

డోర్నకల్, ఆగస్టు 30 : గ్రామాల్లో పారిశుధ్య పనులు అధ్వానంగా ఉన్నాయని, సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి ఉప్పెనపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెరుమాండ్ల సంకీస గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, ప్రభుత్వ వైద్యశాలల్లో సరైన వైద్యం అందక ప్రైవేటుకు వెళ్లి వేలల్లో డబ్బులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యులు గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శెట్టి వెంకన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి సైదానాయక్

ఆశ్రమ పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న డీడీ సైదా నాయక్

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 30 : జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి సైదానాయక్ అన్నారు. శుక్రవారం ఆయన రెడ్యాల గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను తనిఖీ చేసి మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. చ దువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల రిజిస్టర్లు, వంటగది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో వార్డెన్ మోహన్‌నాయక్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్ష పడేలా దర్యాప్తు చేయాలి : డీఎస్పీ సైదులు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 30 : గంజాయి కేసుల్లో నిందితులకు శిక్షపడేలా దర్యాప్తు చేయాలని నార్కోటిక్ డీఎస్పీ సైదులు సూచించారు. శుక్రవారం టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ ఆదేశాల మేరకు గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. గంజాయి జోలికి పోవాలంటేనే నిందితులకు భయం కలగాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ అక్రమరవాణాపై కఠినంగా వ్యవహరిస్తున్నదని డీఎస్పీ తెలిపారు.

శ్మశాన వాటిక, అంబేద్కర్ భవన్‌కు మోక్షమెప్పుడో?

అంబేద్కర్‌నగర్‌లో అసంపూర్తిగా ఉన్న శ్మశానవాటిక

తొర్రూరు, ఆగస్టు 30: మున్సిపాలిటీ పరిధిలోని శశ్మానవాటిక, అంబేద్కర్ భవన్‌కు మోక్షం ఎప్పుడు లభిస్తుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారని సామాజిక కార్యకర్త, అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు మంగళపల్లి నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శ్మశానవాటిక కోసం రూ.50లక్షలు, కూలిపోయే దశలో ఉన్న అంబేద్కర్ నగర్ కమ్యూనిటీ హాల్ స్థానంలో అంబేద్కర్ భవన్ నిర్మాణం కోసం రూ.కోటి మంజూరు చేశారని, టెండర్లు అయినా పనులు ప్రారంభించ లేదన్నారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డికి, ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రారంభించాలని కోరారు.

పాత పెన్షన్ పునరుద్ధరణే ఏకైక పరిష్కారం

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కురవి, ఆగస్టు 30 : సీపీఎస్ స్థానంలో ఏకీకృత పెన్షన్ పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త విధానాన్ని అంగీకరించేది లేదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ స్పష్టం చేశారు. టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని మొగిలిచర్ల, రాజోలు, నల్లెల్ల, మోద్గులగూడెం పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నూతన ఏకీకృత పెన్షన్ విధానం అమలు చేయొద్దని, ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, బాబు, సురేశ్, రాజు, సలీం, వీరన్న పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడిన చెట్టుకొమ్మ

వర్షానికి విరిగిన చెట్టుకొమ్మ

వాహనాల రాకపోకలకు ఇబ్బంది

కురవి(సీరోలు), ఆగస్టు 30 : కురవి, సీరోలు మండలాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సీరోలు మండలం బీల్యాతండా వద్ద 365 ఎ జాతీయ రహదారి రోడ్డుపక్కన ఉన్న పెద్ద చెట్టుకొమ్మ వర్షానికి విరిగి రోడ్డుపై పడింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. తండావాసులు, వాహనదారులు కలిసి చెట్టుకొమ్మను రోడ్డుపై నుంచి తప్పించారు. దీంతో రాకపోకలు కొనసాగాయి.

సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ సునీత

'అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి'

డోర్నకల్, ఆగస్టు 30 : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డోర్నకల్ మాజీ ఎంపీటీసీ నల్లబోలు సునీత శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అగ్రిగోల్డ్‌తో నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బాల మల్లేశ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బదావత్ శ్రీను

'పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలి'

గార్ల, ఆగస్టు 30: పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్ మండల అధ్యక్షుడు బదావత్ శ్రీను అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీఎస్ సీపీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో వచ్చే నెల ఒకటిన జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. మాలోత్ శివనాయక్, ఈరు, భోజ్యానాయక్, హీరాలాల్, భాస్కర్, నాగేశ్వరావు, రాము, నరేశ్, శ్రీనివాస్, వీరభద్రం, కోటయ్య, రవి, పాల్గొన్నారు.

'హోప్' సేవలు అభినందనీయం

దంతాలపల్లి, ఆగస్టు 30 : హోప్ చారిటబుల్ సొసైటీ సేవలు అభినందనీయమని మండల నోడల్ అధికారి శ్రీదేవి అన్నారు. హోప్ చారిటబుల్ సొసైటీ ఖమ్మం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బొడ్లాడ, కుమ్మరికుంట్ల, రేపోణి, వాల్యాతండా, పంతులుతండాలోని పాఠశాలల్లో 203 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో దంతాలపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం వేణుమాధవ్‌రెడ్డి, సొసైటీ సభ్యుడు వేణు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, ప్రవీణ్‌రెడ్డి, ప్రియాంక, శ్రీనివాస్, మంజుల, సీఆర్పీలు మురళి, కవిత, రామకృష్ణ, మహేశ్ పాల్గొన్నారు.

కుమ్మరికుంట్ల పాఠశాలలో నోట్ బుక్స్, బ్యాగులు అందిస్తున్న హోప్ చారిటబుల్ సొసైటీ సభ్యులు

డోర్నకల్ పట్టణంలోని థర్డ్ మెయిన్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

మెయిన్ రోడ్డులో నిలిచిన వర్షపు నీళ్లు

డోర్నకల్, ఆగస్టు 30: డోర్నకల్ పట్టణంలోని థర్డ్ మెయిన్ రోడ్డులో శుక్రవారం కురిసిన వర్షానికి నీళ్లు నిలిచి ప్రజలు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను సరి చేసి నీళ్లు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. నీళ్లు నిల్వ ఉండడం వల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులకు గురి కావాల్సి వస్తున్నదని, అధికారులు స్పందించాలని కోరారు.

వచ్చే నెల 2న స్పాట్ ప్రవేశాలు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 30 : పట్టణంలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరంలో స్పాట్ ప్రవేశాల కోసం విద్యార్థులు నేరుగా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బలరాంనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్ఈ, సీఎస్ డేటా సైన్స్, ఈసీఈ, ఈఈఈ, మెకానిక్ గ్రూపుల్లో ప్రవేశాల కోసం సెప్టెంబర్ 2న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో నేరుగా డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్ జేఎన్‌టీయూ హైదరాబాద్(కూకట్‌పల్లి)లో సంప్రదించాలన్నారు.

ఉద్యోగులకు విరమణ సహజం

డోర్నకల్, ఆగస్టు 30 : ఉద్యోగ విరమణ సహజమని డీఎంహెచ్‌వో మురళీధర్ అన్నారు. శుక్రవారం డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో జడల వీరబాబు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రమీలారావు, సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగేశ్వరావు, డీపీఎంవో మంగమ్మ, హెచ్ఈ గీత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సద్విజ, కనకదుర్గ, శివ, వీరాజిత, సూపర్‌వైజర్ వెంకన్న పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

కేసముద్రం, ఆగస్టు 30 : అర్హులందరికీ రుణమాఫీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కుర్ర మహేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా కూలీలకు ఏడాదికి రూ.12వేలు అందించాలని డిమాండ్ చేశారు. రేషన్ ద్వారా 9 రకాల సరుకులను అందించాలని, ఉపాధి పనులను 200రోజులకు పెంచాలని కోరారు. వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర చట్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొడిశాల వెంకన్న, మాద శ్రీనివాస్‌గౌడ్, జ్యోతి, వెంకన్న, కవిత, కాంతమ్మ, సంపత్, ప్రవీణ్, శారద, రాము పాల్గొన్నారు.

పర్యావరణహితంగా తీర్చిదిద్దాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 30 : ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణాన్ని పర్యావరణహితంగా తీర్చిదిద్దాలని ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం కళాశాలలో 'క్లైమెట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్ క్లబ్'ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళాశాలలో పచ్చదనం ఉండేలా మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ప్రతిఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు సాంబశివరావు, హథీరామ్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

మిరప నాట్లకు జాగ్రత్తలు తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 30 : రైతులు మిరప నాట్లు వేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ మాలతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముదిరిన మిరప నారును నాటొద్దని, ఒకటి రెండు వరుసల్లో దగ్గరగా నాటుకోవాలని సూచించారు.

చంద్రగిరి, పెద్దకిష్టాపురంలో వైద్య శిబిరం

గార్ల, ఆగస్టు 30: చంద్రగిరి, పెద్ద కిష్టాపురం గ్రామాల్లో ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రమ శిక్షణతో కష్టపడి చదవాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 30 : విద్యార్థులు క్రమ శిక్షణతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులో ప్రతిభ కనబరిచి, అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేయాలన్నారు.

హాజరు శాతం పెంచాలి

బయ్యారం, ఆగస్టు 30 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు శాతాన్ని పెంచాలని సీడీపీవో శిరీష, ఏసీడీపీవో కమలాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పలపాడు సెక్టార్ పరిధిలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కొత్త సిలబస్ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, సర్దార్ బీ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉత్తమ డ్రైవర్లకు సన్మానం

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 30 : వరంగల్ రీజనల్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం త్రైమాసిక ప్రగతిలో భాగంగా మానుకోట డిపో ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. రీజియన్ లెవల్‌లో శ్రీనివాస్, నాగరాజు, ఆర్‌బీ సింగ్ వరంగల్ ఆర్ఎం విజయభాను చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు వీరిని ఆదర్శంగా తీసుకొని ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆర్ఎం తెలిపారు.

హోంగార్డ్‌కు సన్మానం

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 30 : పోలీస్ శాఖలో 35 సంవత్సరాలు హోంగార్డుగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన జే వెంకన్నను శుక్రవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వెంకన్నకు మెమెంటో అందజేశారు.

తండ్రిపై గొడ్డలితో దాడిచేసిన కొడుకు అరెస్టు

కురవి(సీరోలు), ఆగస్టు 30 : ఆస్తి తగాదాల కారణంగా తండ్రిపై గొడ్డలితో దాడిచేసి గాయపరిచిన కొడుకును శుక్రవారం అరెస్టు చేసినట్లు సీరోలు ఎస్సై నగేశ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సీరోలు మండలం చింతపల్లి శివారు కొత్తతండాకు చెందిన బానోత్ భీమాకు ఇద్దరు కొడుకులు. భూతగాదా విషయంలో ఈ నెల 27న తండ్రి భీమాపై పెద్ద కొడుకు స్వామి గొడ్డలితో దాడిచేసి గాయపరిచాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం స్వామిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం

డోర్నకల్, ఆగస్టు 30 : మండలంలోని తోడేళ్లగూడెం గ్రామంలో వివాహిత అదృశ్యమైంది. సీఐ రాజేశ్ కథనం ప్రకారం.. తోడేళ్ల గూడెం గ్రామానికి చెందిన అజ్మీర ప్రసాద్‌కు మోదుగుగడ్డ తండాకు చెందిన దివ్యతో 6 నెలల క్రితం పెండ్లి జరిగింది. ప్రసాద్ హైదరాబాద్‌లో ఉంటూ బ్యాంకు సంబంధిత జాబ్ కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. దివ్య అత్తగారి ఇంటి వద్దనే ఉంటున్నది. ఈ నెల 27న మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిన దివ్య తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో భర్త ప్రసాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.